

సాక్షి
అనంతపురం
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



చీనీ @ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టం రూ.13 వేల ప్రకారం అమ్మకాలు జరిగాయి.



కిలో టమాటా రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికాయి.



జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువ జామున కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

గుత్తి బైపాస్ రైల్వే స్టేషన్ పేరు మార్పు

- గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌గా నామకరణం చేస్తూ ఉత్తర్వులు



గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రైల్వే గేట్ సమీపంలో కొత్తగా ఏర్పాటైన బైపాస్ రైల్వే స్టేషన్ (బైపాస్ లైన్)కు గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌గా నామకరణం చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే ఉన్నతాధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు చౌదరి విజయ భాస్కర్, రామాంజి, యువజన అధ్యక్షుడు చిరంజీవి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

27లోపు ఓటరు జాబితా సిద్ధం చేయాలి


అనంతపురం రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ స్థానాలకు త్వరలోనే ఉప ఎన్నికలు నిర్వహిస్తామని, అందువల్ల ఈ నెల 27వ తేదీలోపు ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మరణించిన, ఇతరత్రా కారణాల వల్ల ఖాళీ అయిన రెండు సర్పంచ్, నాలుగు ఎంపీటీసీ స్థానాలతో పాటు 33 వార్డు మెంబర్ల స్థానాలకు త్వరలోనే ఉప ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ఓటరు జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందువల్ల ఇటీవల ప్రచురించిన అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను అనుసరించి పంచాయతీ ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈనెల 27వ తేదీ ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు.

28న 'విద్యా దీవెన' సొమ్ము జమ

అనంతపురం రూరల్: 'జగనన్న విద్యా దీవెన' సొమ్మును ఈ నెల 28న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022– 23 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న వారు గ్రామ/వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ లాగిన్ ద్వారా ఐదంచెల ధ్రువీకరణ చేయించుకోవాలని సూచించారు. గతంలో విద్యా దీవెన పొందిన విద్యార్థులు కళాశాలలకు ఫీజులు చెల్లించే విధంగా వారి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే అర్హులైన విద్యార్థులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలపై ఉందన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంటనే రెన్యూవల్ దరఖాస్తులతో పాటు, విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తి చేయాలని సూచించారు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోళ్లు

- జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి



వజ్రకరూరు: ప్రభుత్వం రూ. 5,335 మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు చేసేందుకు త్వరలో కేంద్రాలను ఏర్పాటు చేయనుందని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన మండలంలోని కమలపాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా రబీ సీజన్‌లో 68,000 హెక్టార్లలో రైతులు పప్పుశనగ సాగు చేశారన్నారు. పంటకాలం ముగింపు దశకు చేరుకోవడంతో విత్తనాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించి ఉండాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు జిల్లాకు ఐసీడీఎస్ డైరెక్టర్ సిరి రాక

అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ అట్టాడ సిరి శుక్రవారం జిల్లాకు రానున్నారు. నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేయనున్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పీడీ శ్రీదేవి తెలిపారు.

మోగిన నగారా



పట్టభద్ర, ఉపాధ్యాయ ఓటర్లు ఇలా....

జిల్లా	పట్టభద్ర ఓటర్లు	ఉపాధ్యాయ ఓటర్లు
కర్నూలు	61,684	5,364
నంద్యాల	54,803	4,402
అనంతపురం	67,665	5,461
శ్రీ సత్యసాయి	43,007	3,199
వైఎస్సార్	81,187	7,358
అన్నమయ్య	20,461	1,932
మొత్తం	3,28,807	27,716

- ఫిబ్రవరి 16 – ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ
- ఫిబ్రవరి 23 – నామినేషన్ల దాఖలుకు ఆఖరు
- ఫిబ్రవరి 24 – నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 27 – నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ
- మార్చి 13 – పోలింగ్
- మార్చి 16 – ఓట్ల లెక్కింపు
- మార్చి 21 – ఎన్నికల ప్రక్రియ ముగింపు

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- గురువారమే అమల్లోకి ఎన్నికల కోడ్
- ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల స్థానాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు)నియోజకవర్గం పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. భారత ఎన్నికల సంఘం గురువారం ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

మార్చి 21 వరకూ 'కోడ్'

షెడ్యూల్ ప్రకారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఈనెల 16వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్ల దాఖలుకు ఈనెల 23వ తేదీ వరకూ అవకాశం ఉంటుంది. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ), 27వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు ఛాన్స్ ఉంటుంది. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 16వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మార్చి 21వ తేదీన ముగిస్తుంది.

మార్చి 29వ తేదీతో ముగియనున్న పదవీకాలం..

ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం నుంచి వెన్నపూస గోపాల్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తుండగా, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కత్తి నరసింహారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి జి.దీపక్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరందరి పదవీ కాలం మార్చి 29వ తేదీ ముగియనుంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో పట్టభద్ర నియోజకవర్గ ఓటర్లు 3,28,807 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 27,716 మంది ఉన్నారు. ఇక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు ఓటర్లుగా ఉండగా జిల్లాలో 1,286 ఓట్లు ఉన్నాయి.

అమలులోకి ఎన్నికల కోడ్..

భారత ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను విడుదల చేసిన వెంటనే జిల్లాలో కోడ్ (ప్రవర్తనా నియమావళి) అమలులోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

ఓటర్లు ఇలా...

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు ఉమ్మడి జిల్లాలు) పట్టభద్ర నియోజకవర్గంలో 3,28,807 మంది ఓటర్లు ఉండగా... ఇందులో పురుష ఓటర్లు 2,21,558 మంది, మహిళ ఓటర్లు 1,07,216 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 33 మంది ఉన్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గంలో 27,716 మంది ఓటర్లు ఉండగా... ఇందులో పురుష ఓటర్లు 17,023 మంది, మహిళ ఓటర్లు 10,689 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. ఎన్నికల నామినేషన్ ప్రారంభించే ముందు రోజు వరకు ఓటర్లగా నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో ఈనెల 15వ తేదీ వరకు అందే దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించి అనుబంధ జాబితాలో చేరుస్తారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది..



ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పాటు కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు తగు చర్యలు చేపట్టారు. నిబంధనలకనుగుణంగా సభలు, సమావేశాలపై నిషేధం విధించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. ఈ క్రమంలోనే అనంతపురం జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కప్పేసిన దృశ్యం.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సీమ రైతుల గొంతు కోసింది బాబే

- టీడీపీ హయాంలోనే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులకు పునాది
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజం
- అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకుంటామని స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ జిల్లాల్లోని రైతుల గొంతు కోసింది టీడీపీ అధినేత చంద్రబాబేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన అడ్డగోలు వ్యవహారాల వల్లనే అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కర్ణాటక ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విమర్శించారు. గురువారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులకు పునాదులు పడ్డాయన్నారు. అప్పట్లో ప్రాజెక్టుల ఎత్తు పెంచినా నోరు మెదపలేదన్నారు. రెండో విడత అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులు వచ్చినా అభ్యంతరం చెప్పలేదన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి బతికున్నంత కాలం అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు, అనుమతులు రాలేదని ఆయన గుర్తు చేశారు. 2010లో 9 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తే 2011లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చిందన్నారు. ఈరోజుకు కూడా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేటాయింపులు లేవన్నారు. పట్టిసీమ డైవర్షన్ ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించారనే సాకుతో తమ రాష్ట్రానికి అదనంగా 25 టీఎంసీల నీటిని కేటాయించాలనే వాదనను తీసుకొచ్చిన కర్ణాటక రాష్ట్రం వీటిని కూడా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి డీపీఆర్ తయారుచేసిందన్నారు. 2017లో టీడీపీ హయాంలోనే ప్రాజెక్టు కోసం స్టేజ్–2 అనుమతులు వచ్చాయన్నారు. ఇంత జరిగినా చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖలు పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంపై కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో సుప్రీం కోర్టులో పిటీషన్ వేయనున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబును జైలుకు పంపాలి

జలవనరుల రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. 2004లో చంద్రబాబు దిగిపోయే నాటికి 2003–04లో రూ. 1,600 కోట్లు ఖర్చు చేస్తే, 2004–05లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 3,300 కోట్లు, ఆ తరువాతి సంవత్సరాల్లో రూ. 6 వేల కోట్లు, రూ. 9 వేల కోట్లు, రూ. 12 వేల కోట్లు, రూ. 16 వేల కోట్లను కేటాయించి సాగునీటి రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా రూ. లక్ష కోట్లతో జలయజ్ఞం పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టిసీమ ప్రాజెక్టు పేరుతో మాయ మాటలు చెప్పి కాలం వెళ్లబుచ్చాడని విమర్శించారు. కర్ణాటకలో ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ అక్కడ మళ్లీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. మన రాష్ట్రంలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకుండా అన్యాయం చేస్తోందన్నారు. చంద్రబాబు అధికార యావకు నేడు రాయలసీమలో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆవేదన మిగిల్చిన చంద్రబాబును ఉరితీయడమో లేదా జైలుకో పంపాలన్నారు. టీడీపీ నేతల కపటనాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ వారే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

రాజీమార్గం ప్రాధాన్యత వివరించాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వయంతో పని చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక చాంబర్ నుంచి ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజీ మార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాలకు తెలియజేసి, ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దర్యాప్తు అధికారులు యూఐ కేసుల తగ్గింపు కోసం సంబంధిత న్యాయమూర్తులను సంప్రదించి పెండింగ్ కేసులు తగ్గేలా కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఘటనలకు తావివ్వకూడదన్నారు. రానున్న రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుకుగా పని చేయాలన్నారు. ముందస్తు సమాచార సేకరణలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్ దేవ్ సింగ్, జిల్లా పోలీసు కార్యాలయాల నుంచి ఇరు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పలమనేరు డిపో డ్రైవర్‌పై చర్యలు తీసుకోలేదు

- అబద్ధాలు మాట్లాడటానికి లోకేష్‌కు సిగ్గుండాలి
- ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



అనంతపురం క్రైం: పలమనేరు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ గోవిందరాజులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల స్పష్టం చేశారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనకు షేక్ హ్యాండ్ ఇచ్చిన ఆర్టీసీ డ్రైవర్ గోవిందరాజులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగం నుంచి తొలగించారని లోకేష్ అన్న మాటలపై మంజుల మండిపడ్డారు. ఆ డ్రైవర్‌ను ఎవరూ ఉద్యోగం నుంచి తొలగించలేదన్నారు. అయినా ఇలా అబద్ధాలు చెప్పేందుకు లోకేష్‌కు సిగ్గుండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు, అతని కుమారుడు లోకేష్ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వారెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మరన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. లోకేష్ పాదయాత్ర ఈ రాష్ట్రానికి పట్టిన శని అని, అంతకంటే దరిద్రం ఇంకొకటి లేదన్నారు.

పైపైపూత.. నిధుల మేత

ప్రతిపాదనల్లో ఉన్న మరుగుదొడ్లు నిర్మించలేదు. గదులకు ఫ్లోరింగ్ వేయలేదు. వైరింగ్ ఊసే లేదు. కానీ, బిల్లుల మంజూరుకు ఫైల్ రెడీ అయిపోయింది. మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో వెలుగుచూసిన చోద్యమిది. రూ.12 లక్షలతో నాణ్యతగా చేపట్టాల్సిన పనులను పైపైనే కానిచ్చేసి చేతులు దులుపుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ కీలక అధికారికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. – అనంతపురం సెంట్రల్



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

- రూ. 12 లక్షలతో ప్రహరీ నిర్మాణమట!
- ఐసీడీఎస్ కార్యాలయంలో వింత
- ప్రతిపాదనల్లోని పనులేవీ చేపట్టని కాంట్రాక్టర్
- అయినా ఫైనల్ బిల్ పెట్టిన అధికారులు

కలెక్టరేట్‌కు సమీపంలో దశాబ్దాలుగా ఐసీడీఎస్ పీడీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇటీవల కలెక్టరేట్ మీదుగా పంగల్‌రోడ్డు వరకూ నాలుగు వరసల రహదారి నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో ఐసీడీఎస్ కార్యాలయం ప్రహరీ తొలగించారు. దీంతో ప్రహరీ నిర్మాణం, పైకప్పు సీలింగ్ ఫ్లోరింగ్, కార్యాలయానికి పెయింటింగ్, మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం టాయిలెట్, నూతన వైరింగ్ తదితర మరమ్మతుల పనులకు ఐసీడీఎస్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. రూ.12 లక్షలతో పనుల నిర్మాణానికి కలెక్టర్ ఆమోదముద్ర వేశారు.

ఒక్క పనీ సరిగా చేయలేదు..

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చాలా రోజుల పాటు పనులు ప్రారంభించలేదు. చివరలో మొదలుపెట్టిన ఆయన... ప్రతిపాదనల్లో ఉన్న ప్రాధాన్యతా పనులనే తెరమరుగు చేశారు. ఐసీడీఎస్‌లో మెజార్టీ ఉద్యోగులు మహిళా అధికారులే ఉన్నారు. కేవలం పీడీ కార్యాలయంలో దాదాపు 20 మంది వరకూ మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరే కాకుండా వివిధ పనుల కోసం ప్రాజెక్టు కార్యాలయం నుంచి సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు అనేక మంది వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగా టాయిలెట్ నిర్మించాలని నిర్ణయించారు. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో విద్యుత్ వైర్లు పాడవడంతో నూతనంగా ఏర్పాటు చేయాలని, పైకప్పు లీకులు ఏర్పడకుండా ఫ్లోరింగ్ వేయించాలని తీర్మానించారు. కానీ, ఇలాంటి పనులేమీ చేపట్టలేదు.

ఓ అధికారిణి భర్త కీలక పాత్ర

గతంలో కార్యాలయంలోకి పీడీ వాహనం వచ్చేలా గేటు నిర్మించారు. ప్రస్తుతం టూవీలర్ వచ్చేందుకు మాత్రమే గేటు ఉంది. కానీ ప్రతిపాదనల్లో నూతన గేటు ఏర్పాటు అంశం కూడా ప్రస్తావించారు. కాంపౌండ్ వాల్ కూడా జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా తొలగించిన స్థానంలో మాత్రమే నిర్మించారు. పాత ప్రహరీకి పెయింట్ వేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి. ప్రతిపాదనల పనులు మరుగున పెట్టడం విషయంలో ఐసీడీఎస్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ కీలక మహిళా ఉద్యోగి భర్త పాత్ర కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రూ. 16 లక్షలతో పిల్లర్లతో కూడిన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణం, టాయిలెట్స్, ప్రహరీ ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఐసీడీఎస్ కార్యాలయానికి పెయింటింగ్, పైపై పూతల పనులకే రూ. 12 లక్షలు వెచ్చించడంపై ఆశాఖ ఉద్యోగులే విస్మయానికి గురవుతున్నారు.

అన్ని పనులూ నేను చూసుకోలేను

ఐసీడీఎస్ పీడీ కార్యాలయం మరమ్మతుల కోసం రూ. 12 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఏ పనులు చేపట్టాలి. ఎలా చేపట్టాలి? అనే విషయాలతో మాకు సంబంధం లేదు. పంచాయతీరాజ్ అధికారులు చూసుకోవాలి. ప్రతిపాదనల్లో ఉన్న పనులు చేపట్టారా? నాణ్యతగా చేశారా? అన్నది కూడా మాకు సంబంధంలేదు. అన్ని పనులూ నేనే చూసుకోలేను.
– శ్రీదేవి, ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

సర్కారు పెళ్లి కానుక

- నేడు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నగదు జమ



అనంతపురం రూరల్: నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్ల భారం కారాదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ కల్యాణ మస్తు', 'షాదీ తోఫా' పథకాలకు ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతులకు సాయం అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాలో 309 మందికి రూ. 2.48 కోట్ల లబ్ధి చేకూర్చేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. శుక్రవారం సీఎం వైఎస్ జగన్ లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను వర్తింపజేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు.

అదనపు కోటాను విడుదల చేయండి

- టీబీ బోర్డుకు హెచ్‌ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ లేఖ



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్‌ఎల్‌సీ)కు అదనంగా కేసీ కెనాల్ వాటా నీటిని విడుదల చేయాలని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ గురువారం టీబీ బోర్డుకు లేఖ రాశారు. ఈ ఏడాది దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 30.381 టీఎంసీలు విడుదల చేశారు. నికర జలాల కోటా త్వరలో ముగియనున్న నేపథ్యంలో అదనపు కోటా విడుదల చేయాలని కోరారు. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనంత కోసం ప్రత్యేకంగా కేసీ కెనాల్ వాటా 10 టీఎంసీలను హెచ్చెల్సీకి విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు. కేసీ కెనాల్‌కు పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసేలా ప్రత్యేకంగా జీఓ విడుదల చేశారు. అప్పటి నుంచి హెచ్చెల్సీకి అదనపు కోటా నీటిని దామాషా ప్రకారం తుంగభద్ర నుంచి విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది 2 టీఎంసీలు విడుదల చేయడానికి బోర్డు అధికారులు అంగీకారం కూడా తెలిపారని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ 'సాక్షి'కి తెలిపారు.

శనగ పండింది

- ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి
- పెరిగిన దిగుబడులతో ఆనందోత్సాహంలో రైతులు



కళ్లంలో రాసిపోసిన శనగలు

కణేకల్లు: నల్లరేగడి భూములున్న రైతుల ఆశల పంట పప్పుశనగ ఈ ఏడాది బాగా పండింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దిగుబడులు ఎక్కువగా వచ్చాయి. దీంతో శనగ రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలో వేరుశనగ పంట తర్వాత అధిక విస్తీర్ణంలో సాగవుతోంది పప్పుశనగ మాత్రమే. ఈ ఏడాది రబీలో 1,37,772 ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేశారు. పంట కాలం పూర్తి కావడంతో కోత కోసి నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో పంట దిగుబడిని చూసి రైతులే ఆశ్చర్యపోతున్నారు. ఇలాంటి దిగుబడి 12 ఏళ్ల క్రితం చూశామని రైతులు పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.22 వేల ఆదాయం

రబీ సీజన్‌లో పొగమంచు, కొద్దిపాటి వర్షానికి శనగ పంట చేతికి వస్తుంది. దీంతో నల్లరేగడి భూములున్న రైతులు శనగ పంటనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. జిల్లాలోని అనంతపురం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, తాడిపత్రి వ్యవసాయ డివిజన్లలో ఈ రబీ సీజన్‌లో 1,37,772 ఎకరాల్లో రైతులు శనగను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏటా అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల కారణంగా తీవ్ర నష్టాన్ని చవిచూసే రైతులకు ఈసారి దిగుబడులు ఎంతో సంతృప్తినిచ్చాయి. ఈ క్రమంలో శనగ పంటను క్వింటా రూ.5,335 కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.4,500తో అమ్ముడుబోతోంది. డబ్బు అత్యంత అవసరమున్న రైతులు తమ ఉత్పత్తులను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన పెట్టుబడులు పోను ఎకరాకు రూ.22వేల వరకూ ఆదాయం సమకూరుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

అనుకూలించిన వాతావరణం

పప్పుశనగ పంట సాగుకు ఈ సారి వాతావరణం బాగా అనుకూలించింది. అక్టోబర్ నెలాఖరులో శనగ విత్తు వేశారు. నవంబర్ నాటికి సరిగ్గా 35 నుంచి 40 రోజుల వ్యవధిలో వర్షాలొచ్చాయి. ఈ వర్షానికి కొమ్మలు బాగా వేసి ఎక్కువ పూత కాయలు కట్టాయి. కొంత ఆలస్యంగా విత్తిన పొలాల్లో పూత సమయంలో పొగమంచు ప్రభావం తప్పించినట్టైంది. కణేకల్లు, ఉరవకొండ, బెళుగుప్ప, వజ్రకరూరు, విడపనకల్లు, పుట్లూరు ప్రాంతాల్లో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలోనే శనగ పంట సాగులో కణేకల్లు ప్రథమస్థానంలో నిలిచింది. శింగనమల మండలంలో అతితక్కువ అంటే 111 ఎకరాల్లో శనగ పంట సాగు చేయగా.. కణేకల్లు మండలంలో అత్యధికంగా 23,759 ఎకరాల్లో సాగు చేశారు.

జిల్లాలో వ్యవసాయ డివిజన్ల వారీగా శనగ సాగు వివరాలు

డివిజన్	శనగ సాగు ఎకరాల్లో
ఉరవకొండ	54,440
అనంతపురం	2,612
కళ్యాణదుర్గం	13,403
తాడిపత్రి	34,053
రాయదుర్గం	28,287
గుత్తి	5,438

సంతోషంగా ఉంది



నేను మొత్తం 35 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఎకరానికి రూ.10వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఈసారి ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించాను చాలా సంతోషంగా ఉంది.

– జగన్నాథరెడ్డి, సొల్లాపురం

ఎప్పుడూ చూడలేదు



ఇలాంటి దిగుబడులు నేనైతే ఎప్పుడూ చూడలేదు. 30 ఎకరాలు కౌలుకు తీసుకుని శనగ సాగు చేశాను. ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఏడెనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కూడా క్వింటా రూ.5,335తో కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది.

– ఎర్రిస్వామి, కౌలురైతు, పెనకలపాడు

రైతు కష్టం తీరింది



ఈ–క్రాప్ లెక్క ప్రకారం కణేకల్లు ప్రాంతంలో 23,759 ఎకరాల్లో శనగ పంట సాగైంది. పంట కోత ప్రయోగాలు చేస్తే ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల వరకూ దిగుబడులు వచ్చాయి. వాతావరణం అనుకూలించడం, తెగుళ్ల తీవ్రత తక్కువగా ఉండడంతో మేలైన దిగుబడులు వచ్చాయి. ఈసారి శనగ రైతుల కష్టం తీరింది.

– శ్రవణ్‌కుమార్, ఏఓ, కణేకల్లు

క్లుప్తంగా

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ విజేతగా ఏపీ జట్టు



ట్రోఫీతో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఒడిశాలోని పూరి వేదికగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన సీనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు విజేతగా నిలిచింది. గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ గురువారం జరిగింది. పంజాబ్ జట్టుపై ఏపీ జట్టు 2–1 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. కాగా, ఏపీ జట్టుకు అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ ఆధ్వర్యంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించిన విషయం తెలిసిందే. జట్టులో అనంతకు చెందిన నలుగురు క్రీడాకారులు ఉండడం విశేషం. చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్న ఏపీ జట్టులోని క్రీడాకారులను రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శశిభూషణ్, నాగేంద్ర, సీఈఓ వెంకటేశులు ప్రత్యేకంగా అభినందించారు.

నాలుగు దుకాణాల్లో చోరీ

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వాణిజ్య సముదాయంలో ఏర్పాటు చేసిన నాలుగు దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం దుకాణ యాజమానులు ఈ విషయాన్ని గుర్తించారు. గార్మెంట్స్ షాప్‌లోని క్యాష్ బాక్స్‌లో ఉంచిన రూ.10వేలు, దుస్తులు అపహరించుకెళ్లారు. ఎరువుల దుకాణంలో రూ.10వేలు, మందుల షాపు, ఎయిర్‌టెల్ షాపులో నగదు దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

విషపూరిత నీరు తాగి గొర్రెల మృతి

బ్రహ్మసముద్రం: విషపూరిత నీరు తాగి గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం తిప్పయ్యదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల కెంచప్ప గురువారం తన మూగజీవాలను మేపునకు సమీపంలోని పంట పొలాల్లోకి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం దాహంతో అలమటిస్తున్న గొర్రెలు... పొలంలో డ్రిప్ ద్వారా పంటకు అందజేసేందుకు క్రిమి సంహారక మందు కలిపిన నీటిని తాగాయి. విషయాన్ని రైతుతో పాటు కాపరి గమనించేలోపు 5 మేకలు, 9 గొర్రెలు ఒకదాని తర్వాత ఒకటి కుప్పకూలి మృతి చెందాయి. వీటి విలువ దాదాపు రూ.1.30 లక్షలని బాధిత కాపరి వాపోయాడు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అక్కడకు చేరుకుని గొర్రెల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి: డీపీఎంఓ

వజ్రకరూరు: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు తప్పక సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రులోనే కాన్పు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి, సీహెచ్ఓ గంగాధర్, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు పద్మావతి, సుశీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాకీ చెల్లించలేదని మూడు ఎకరాల్లో పంటను ఎత్తుకెళ్లారు

పుట్లూరు: వ్యాపారుల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. బాకీ చెల్లించలేదంటూ ఓ రైతు పొలంలో నుంచి పప్పు శనగ పంటను ఎత్తుకెళ్లారు. వివరాలు... పుట్లూరు మండలం మడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు నారపరెడ్డి వ్యవసాయంతో పాటు గొర్రెలు, పొట్టేళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తనకు వ్యాపారంలో బకాయి పడిన వారి నుంచి డబ్బు వసూలుచేసుకుని వచ్చేందుకు తెలంగాణ ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో రైతుకు నగదు ఇచ్చిన వ్యాపారులు ముచ్చుకోట గోవర్ధనరెడ్డి, జగదీశ్వర రెడ్డి... బాకీ చెల్లించలేదంటూ ఆయనకు తెలియకుండానే పొలంలో శనగ పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేసి దిగుబడి మొత్తం ఎత్తుకెళ్లారు. ఇటీవల గ్రామానికి చెందిన రైతు నారపరెడ్డి... పంట ఎత్తుకెళ్లిన విషయం తెలుసుకుని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పను కలసి ఫిర్యాదు చేశాడు. నుబాకీ ఉన్న మొత్తాన్ని చెల్లించానని, దౌర్జన్యంతో పంటను ఎత్తుకెళ్లితే ఎలా అని ప్రశ్నించాడు.

ఇంటింటికీ పైప్‌లైన్ గ్యాస్

- జిల్లాలో ప్రప్రథమంగా కక్కలపల్లి కాలనీలో ప్రారంభం
- ప్రారంభించిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పైప్‌లైన్ గ్యాస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) ఎంపీ గోరంట్లమాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాప్తాడు రూరల్: జిల్లాలోనే ప్రప్రథమంగా రాప్తాడు నియోజకవర్గం కక్కలపల్లి కాలనీ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ పైప్‌లైన్ వంట గ్యాస్ సేవలను గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగర గ్యాస్ పంపిణీ వ్యవస్థలో అగ్రగామిగా కొనసాగుతున్న ఏజీ అండ్ పీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ సరఫరా చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో పనులు ప్రారంభించగా రాప్తాడు నియోజకవర్గం అనంతపురం మండలం కక్కలపల్లికాలనీలో పనులు పూర్తయి గురువారం సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి గ్యాస్ ఎప్పుడైపోతుందా అనే టెన్షన్ ఉండదని, ఎల్‌పీజీ కంటే చాలా తేలికైన గ్యాస్ కాబట్టి ప్రమాదాలు జరిగే ఆస్కారమే లేదన్నారు. వినియోగం మేరకే నెలకు బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లీకేజీ ఉండదన్నారు. ఈ అవకాశం రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు కల్పించినందుకు ప్రధాని మోదీకి, సీఎం వైఎస్‌జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పత్రాలను ఎంపీ గోరంట్ల మాధవ్; జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఅండ్‌పీ ప్రథమ్ కంపెనీ రీజనల్ హెడ్ జీపీ వెంకటేశ్, డిప్యూటీ రీజనల్ హెడ్ చిరాగ్ పటేల్, జీవీఎస్ స్టార్ ఇన్‌ఫ్రాసర్వీసెస్ ప్రతినిధి శ్రీనాథ్‌గుప్తా, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, బీసీ సెల్ నాయకులు ధనుంజయయాదవ్, సర్పంచ్ తేజస్విని, ఎంపీటీసీ సభ్యులు గాయత్రి, వడ్డే శీనా, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం భక్తులకు ఇస్కాన్ మహాఅన్నదానం

అనంతపురం కల్చరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తులకు విరివిగా అన్నదాన స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు తెలిపారు. గురువారం సాయంత్రం ఇస్కాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం వరకూ ఎక్కువగా పాదయాత్రతో స్వామి సన్నిధి చేరుకునే వారికి నల్లమల అటవీ ప్రాంతంలో దామర్ల గుట్ట వద్ద ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ అన్నవసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ దోర్నాల చెక్‌పోస్ట్ వద్ద, 17, 18 తేదీల్లో శ్రీశైల దేవస్థానం లోపల ప్రత్యేక కౌంటర్ల ద్వారా భోజన వసతి కల్పిస్తామన్నారు. 2 లక్షల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం లేదా అల్పాహారం భక్తు కోరిక మేరకు అందిస్తామన్నారు. అలాగే గ్లూకోజ్, వాటర్, అంబులెన్సు సౌకర్యం కూడా ఉంటుందన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం.. ప్రాణాలు కోల్పోయిన రైతు

- విద్యుదాఘాతంతో యువరైతు మృతి
- ఫీజులు మార్చుకోమన్న విద్యుత్ శాఖ సిబ్బంది
- ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్‌ఫ్యూజులు వేస్తుండగా ఘటన



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లీలావతి

కంబదూరు: 'అన్నా! పంటకు నీరు పెట్టుకోవాలి. కరెంటు లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజులు పోయాయి. కాస్త వచ్చి ఫ్యూజులు వేసివ్వండి' అంటూ విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రాధేయపడిన యువరైతు.. కాసేపటికే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం డి.చెన్నేపల్లికి చెందిన బొమ్మయ్య (26), లీలావతి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. లీలావతి ప్రస్తుతం మూడు నెలల బాలింత.

చేసుకోపో ఏమీ కాదులే

వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని బొమ్మయ్య పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తన వ్యవసాయ బోరు బావికి అనుసంధానం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో హెడ్ ఫ్యూజు పోయింది. ఇదే విషయాన్ని నూతిమడుగు ఫీడర్ సబ్‌స్టేషన్ లైన్‌మెన్‌కు బొమ్మయ్య తెలిపాడు. ప్రస్తుతం పవర్ కట్ అయిందని, కాబట్టి నీవే పోల్ ఎక్కి హెడ్‌ఫ్యూజులు వేసుకోవాలంటూ లైన్‌మెన్ సూచించాడు. అయితే కరెంట్ వస్తే ఎలా? అంటూ బొమ్మయ్య ప్రశ్నించడంతో ఇప్పట్లో కరెంట్ రాదు కాబట్టి ఏమీ కాదులే ధైర్యంగా పని పూర్తి చేసుకో అంటూ లైన్‌మెన్ తెలపడంతో బొమ్మయ్య స్తంభం ఎక్కి హెడ్ ఫ్యూజులు వేస్తుండగా ఒక్కసారిగా కరెంటు సరఫరా అయింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభం నుంచి కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై సంబంధిత ఏఈని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.... ఆయన అందుబాటులోకి రాలేదు. కంబదూరు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్పందించిన మానవతావాదులు



నిత్యావసరాలు అందజేస్తున్న వంట గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఓబులేసు, శ్రీధర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి టౌన్: విధి వంచితుల పట్ల మానవతావాదులు స్పందిస్తున్నారు. తాడిపత్రిలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న బుద్ధిమాంద్యం పిల్లల పోషణకు నిరుపేద తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై జనవరి 29న 'విధివంచితులు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం విదితమే. దీనిపై స్పందించిన స్థానిక హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు శ్రీధర్‌రెడ్డి, ఓబులేసు... తల్లి జయమ్మతో కలసి నిత్యాసవర సరుకులను గురువారం పంపిణీ చేశారు. వరుసగా ఆరు నెలల పాటు విధివంచిత పేద పిల్లల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేస్తామని భరోసానిచ్చారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి



స్వామి తీర్థ ప్రసాదాలను అందుకుంటున్న న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి కుటుంబసభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

జడ్జిని కలిసిన న్యాయవాదులు : గుంతకల్లు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు జడ్జిని నియమించాలంటూ హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డికి గుంతకల్లు బార్ అసోషియేషన్ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఉదయం కసాపురం దేవస్థానంలో హైకోర్టు జడ్జిని బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు భాస్కరగౌడ్, కార్యదర్శి గోపాలకృష్ణ కలసి మాట్లాడారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న న్యాయమూర్తి పదోన్నతిపై అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇన్‌చార్జ్ న్యాయమూర్తి కేవలం వారానికి ఒకసారి మాత్రమే వస్తుండడంతో కక్షిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఈ నేపథ్యంలో న్యాయమూర్తి నియామకానికి చర్యలు చేపట్టాలని కోరారు.

గుత్తి: గుత్తి రైల్వేస్టేషన్‌కు గురువారం ఉదయం చేరుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డికి స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. విజయవాడ నుంచి కసాపురం వెళుతూ మార్గమధ్యంలోని గుత్తి ఆర్‌ఎస్‌లో ఆయన దిగారు. ఈ సందర్భంగా గుత్తి ఏడీజే కబర్ధి, తహసీల్దార్ మహబూబ్ బాషా, కోర్టు, రెవెన్యూ సిబ్బంది ఆయనను కలసి ఘనంగా స్వాగతించారు. అనంతరం కాసేపు ఏడీజే కబర్ధితో న్యాయమూర్తి చర్చించారు.

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో గురువారం నిర్వహించిన న్యాయవాది బిందెల కేశవరెడ్డి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కేశవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట వజ్రకరూరు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్రప్ప, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి తదితరులున్నారు.

ఆరు దశాబ్దాల అనుబంధం

- జేఎన్‌టీయూ(ఏ)లో 1958–63 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం



జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధనతో 1958-63 బ్యాచ్ విద్యార్థులు

అనంతపురం: ఆరు దశాబ్దాల అనుబంధం వారిది. ఎనిమిది పదుల వయసులోనూ తరగని ఉత్సాహం..... కళాశాలపై ఎనలేని అభిమానం వారిని నడిపించింది. అప్పట్లో ఐదు సంవత్సరాల బీటెక్ కోర్సులో అడ్మిషన్ పొందిన జేఎన్‌టీయూ 1958–63 (తొలి) బ్యాచ్ విద్యార్థులు అదే కళాశాలలోని ఈఈఈ సెమినార్ హాలులో గురువారం సమావేశమయ్యారు. అప్పటి తమ అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. నాటి గురువులను స్మరించుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని తమ అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. 82 ఏళ్ల వయసులోనూ క్యాంపస్ కళాశాల మొత్తం తిరుగాడారు. హాస్టల్ భవనాలు, తరగతి గదులు చూసి తన్మయత్వం చెందారు.

బ్రాండ్ అంబాసిడర్లు మీరే : వీసీ

కళాశాలకు పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్ధన అన్నారు. 1958–63 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ, మేధోపరమైన, ఆర్థికపరమైన సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాలను అభివృద్ధి బాటలో నడిపిస్తాం

- ఎండోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్



పండమేరు భూములను పరిశీలిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: ఎంతో విలువైన దేవదాయశాఖకు అనుబంధంగా ఉండే ఆలయాల భూములను అన్యాక్రాంతంగా కాకుండా చూస్తామని, ఆలయాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. గురువారం జిల్లా పర్యటన కొచ్చిన జ్వాలాపురం శ్రీకాంత్‌తో కలిసి ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు రాప్తాడు మండలం పండమేరు వెంకటరమణ స్వామి ఆలయ భూములను పరిశీలించారు. జ్వాలాపురం శ్రీకాంత్‌ను ఎండోమెంటు అధికారులు సన్మానించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ హరిత, ఈవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



రాంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం 37వ డివిజన్‌లోని రాంనగర్‌లో రూ.40 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలన్నారు. అనంతరం 32వ డివిజన్‌లోని 46వ సచివాలయాన్ని మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదర్శనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజనాస్పత్రి తనిఖీ



క్యాజువాలిటీ సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వాస్పత్రిని జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, క్యాజువాలిటీ విభాగాన్ని ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోగుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వారికి అందించిన వైద్య సేవలపై వారితో మాట్లాడారు.

సంత మార్కెట్ వేలం వాయిదా

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో శుక్రవారం జరగాల్సిన సంత మార్కెట్ వేలంపాటను మరోసారి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ కే భాగ్యలక్ష్మి గురువారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ నెల 7న జరిగిన సంత మార్కెట్ వేలంపాటలో పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వేలంపాటను కమిషనర్ వాయిదా వేసిన విషయం విదితమే. తదుపరి వేలంపాట తేదీని ముందస్తుగా తెలియజేస్తామని కమిషనర్ తెలిపారు.

పన్ను చెల్లించకపోతే చర్యలు

అనంతపురం క్రైం: ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా జాప్యం చేయడం సరికాదని, ఇలాగే కాలయాపన చేస్తే నగరపాలక సంస్థ అందించే సేవలను ఆపుతామని అదనపు కమిషనర్ రమణారెడ్డి పన్ను చెల్లించని వారిని హెచ్చరించారు. గురువారం రాంనగర్, కోవూర్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఇంటి, నీటి పన్ను చెల్లించాల్సిన ఇళ్లకు అదనపు కమిషనర్ వెళ్లారు. పన్ను సకాలంలో చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు చేపట్టాలని పారిశుధ్య కార్యదర్శులను ఆదేశించారు. అదనపు కమిషనర్ వెంట అడ్మిన్లు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

రాప్తాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తామని ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాతీ చిన్మయనగర్‌లోని గురు రాఘవేంద్ర వృద్ధాశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమంలో ఎంత మందికి పింఛన్లు వస్తున్నాయి..ఎంత మందికి ఇంకా పింఛన్లు రాలేదని ఆశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలో అర్హత ఉండి పింఛన్లు రాని వృద్ధులందరికీ త్వరలోనే పింఛన్లు అందేలా చూస్తామన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోవాలి

ఆత్మకూరు: గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. 42 మంది గర్భిణులు పరీక్షలకు వచ్చారు. వైద్య సిబ్బంది చంద్రావతి, నాగేశ్వరయ్య, తులసమ్మ, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ఆక్రమణలకు పక్కా ప్రణాళిక

నగరంలో పట్టణ ప్రణాళిక అధికారులు ఆక్రమణ తొలగిస్తున్నట్లు హడావుడి చేసి, కొన్నాళ్ల తర్వాత నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పేరుకే నిర్మాణాల ప్రారంభదశలో తొలగిస్తున్నామని ఆర్భాటం చేసి, ఆపై గాలికొదిలేస్తున్నారు. దీంతో నిర్మాణదారుడు ఒకటికి రెండు ఫ్లోర్లు అదనంగా వేసుకుంటూ యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

– అనంతపురం క్రైం:

- అక్రమ నిర్మాణాలను గాలికొదిలేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- పేరుకే హడావుడిగా ఆక్రమణల తొలగింపు
- రోజుల వ్యవధిలో మళ్లీ నిర్మాణాలకు అనుమతి
- ఇదీ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం తీరు



పై చిత్రంలో కనిపిస్తున్న భవన నిర్మాణం నగరంలోని సుభాష్‌రోడ్డు ట్రెండ్స్ షోరూం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతున్నది. అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని గతేడాది నవంబర్ 27న ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి అడ్డుకున్నారు. సెట్ బ్యాక్స్ లేవని, రోడ్డు పైకి వచ్చి నిర్మాణం చేపడుతున్నారని, రెండు పిల్లర్లను జేసీబీతో తొలగించారు. అంగుళం పని కూడా చేయడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు అదే ప్రాంతంలో నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణదారుడు యథేచ్ఛగా పనులు పూర్తి చేస్తున్నాడు. మరికొన్ని ఇలా..

- ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెట్రోల్ బంకు పక్కన ఉన్న కమర్షియల్ భవనం నిర్మాణంలో సన్‌షైడ్ ముందుకు వచ్చారని, సెట్ బ్యాక్స్ లేవన్న కారణంతో టౌన్ ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ పైభాగంలో ఆరు అడుగుల రంధ్రం చేశారు. ప్రస్తుతం నిర్మాణదారుడు ఆ రంధ్రాన్ని పూడ్చేసి, పనులు చేసేందుకు సిద్ధమయ్యాడు.
- కమలానగర్ డీసీఎంఎస్ రోడ్డుకు సమీపంలో ఓ భవన నిర్మాణాన్ని, రాంనగర్‌లో పెట్రోల్ బంకుకు ఎదురుగా నిర్మిస్తున్న ఓ భవనం, కమలానగర్ డ్రెస్ సర్కిల్ ప్రాంతంలోని ఓ భవన నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఆతర్వాత అటువైపుకూడా కన్నెత్తి చూడలేదు. ఇలా నగరంలో వందల సంఖ్యలో భవనాల అతిక్రమణలు (డీవియేషన్స్) జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



ప్రశాంతినగర్‌లోని నాన్‌లేఅవుట్ ప్రాంతంలో అనుమతులు లేకపోయినా పిల్లర్లు వేసిన దృశ్యం

ప్రభుత్వాదాయానికి భారీగా గండి..

- నగరంలోని ప్రశాంతినగర్‌లో నాన్‌లేఅవుట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 10 సెంట్లలో భారీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది లోపాయికార ఒప్పందంతో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిర్మాణదారుడు పిల్లర్ వేసే వరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది.
- విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి అరవిందనగర్‌కు వెళ్లే మార్గంలో ఓ నిర్మాణదారుడు షెడ్లు అడ్డంగా ఉంచి సెల్లార్ పనులతో పాటు, బోర్ వేశారు. సెల్లార్ అనుమతులు లేకున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ అడ్డగోలు బాగోతం జరుగుతోందని టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్తున్నారు.

ఫీజులు వసూలు చేస్తే రూ.కోట్ల ఆదాయం : నగరంలో జరుగుతున్న వెయ్యికిపైగా నిర్మాణాల్లో అధిక సంఖ్యలో భవనాల యజమానాలు ప్లాన్‌లో అనుమతులు ఓ విధంగా తీసుకొని, భవనాలను వారికి నచ్చినట్లు సెల్లార్లు, అదనపు ఫ్లోర్లు ఏర్పాటు చేస్తున్నారు. సెల్లార్లకు అనుమతులు లేకున్నా నగరంలో పదుల సంఖ్యలో గుట్టుచప్పుడు కాకుండా తెరిచేశారు. కమిషనర్ కే భాగ్యలక్ష్మి సైతం అతిక్రమణలున్న మాట వాస్తవమేనని చెబుతున్నారు. నిర్మాణదారుడు నిబంధనల మేరకు భవనాలు నిర్మించి, ఫీజులు చెల్లిస్తే నగరపాలక సంస్థకు రూ.కోట్లలో ఆదాయం పెరుగుతుంది. టౌన్ ప్లానింగ్‌లోని కొందరు అధికారులు, సిబ్బంది కారణంగా ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

నేడు సచివాలయ కన్వీనర్లకు శిక్షణ

రాప్తాడు: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు దిశా, నిర్దేశం చేస్తారన్నారు.

15 న సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: మండలంలోని సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 15న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తప్పక పాల్గొనాలన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో తిరునాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లోని శాశ్వత హుండీల ద్వారా రూ.4 లక్షల ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణ అధికారిణి శోభారాణి, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఏబీకే ప్రసాద్‌కు 'అరసం' అభినందనలు

అనంతపురం కల్చరల్: దేశంలో ప్రతిష్టాత్మక వ్యక్తుల కందించే రాజారామ్మోహన్‌రాయ్ అవార్డును ఈ ఏడాది సీనియర్ జర్నలిస్టు ఏబీకే ప్రసాద్‌కు ప్రకటించడంపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో ప్రధాన పత్రికలన్నింటిలో పనిచేసిన ఆయన.. విలువలతో కూడిన పాత్రికేయుడిగా గుర్తింపు పొందారన్నారు. వైఎస్సార్ హయాంలో ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా కూడా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈనెల 28న ఆయన న్యూఢిల్లీలో అవార్డునందుకుంటారని, ఆయన్ను ఎంపిక చేసిన ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అభినందనీయులన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తారక నగరుకు చెందిన చలపతి, గోవిందురాజులు మట్కా రాస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ. 70 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

రాప్తాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఇటుకులపల్లి సీఐ మోహన్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన ప్రసన్నాయపల్లిలో నాకా బందీ నిర్వహించారు. రౌడీ షీటర్స్, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో మార్పు రావాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

అనంతపురం: అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్ పక్కన ఉన్న బాలికల హాస్టల్‌లో పదోతరగతి విద్యార్థినులకు గురువారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు స్టడీమెటీరియల్ అందించారు. ముఖ్య అతిథిగా పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాస రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి బాబయ్య, లక్ష్మీ ప్రసాద్, మోహన్ రెడ్డి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఇసుక స్టాక్‌పాయింట్లు ఏర్పాటు

కనగానపల్లి: మండలంలో హౌసింగ్ లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా మూడు ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు హౌసింగ్ ఏఈ చిరంజీవి తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లిలో స్టాక్ పాయింట్ నుంచి గురువారం హౌసింగ్ లబ్ధిదారులకు ఇసుక సరఫరాను ప్రారంభించారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద మండలంలో సుమారు 2,500 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని ఏఈ తెలిపారు. వీటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేస్తోందన్నారు. అయితే సదూర ప్రాంతాలకు వెళ్లి ఇసుకను తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులతో పాటు మండల ప్రజాప్రతినిధుల కోరిక మేరకు కనగానపల్లి, మామిళ్లపల్లి, వేపకుంట గ్రామాల్లో ఇసుక పాయింట్లు ఏర్పాటు చేయించామన్నారు. మొత్తం 6 వేల టన్నుల ఇసుక నిల్వ చేసి, చుట్టు పక్కల గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇక్కడ నుంచే ఇసుక సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ షకీలా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి

రాప్తాడు: టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేయడం మానుకోవాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు హితవుపలికారు. మండలంలోని పుల్లలరేవులో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ ఎల్లో మీడియాలో కథనాలు రాయించడంపై ఆయన మండిపడ్డారు. మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో వందలాది ఎకరాలు కబ్జా చేసి, వైఎస్సార్ సీపీ నాయకులే కబ్జాచేశారని చెప్పడం సరికాదన్నారు. 2001లో టీడీపీ హయాంలో అప్పటి నేతలు గ్రామంలో సర్పంచు కోసం వాల్మీకులు నామినేషన్ వేయకుంటే ప్రభుత్వ భూమి చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో అప్పట్లో వాల్మీకులు సర్పంచు పదవికి నామినేషన్ వేయకపోవడంతో సర్పంచు పదవి కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు గ్రామంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిని పంచాయతీ తీర్మానం ఇచ్చి రూ.100 చలానా కట్టించి, పొరంబోకు భూమిని ప్రభుత్వ భూమిగా మార్చి వాల్మీకులకు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి వాల్మీకులే సాగులో ఉన్నారని, వారి పేరున ఆన్‌లైన్‌లో కూడా ఉందన్నారు. ప్రస్తుతం గ్రామంలోని వాల్మీకి నాయకులు వైఎస్సార్‌సీపీ వైపు తిరుగుతుండడంతో గతంలో వాల్మీకులకు ఇచ్చిన ప్రభుత్వ భూమి అని అసత్య ఆరోపణలు చేస్తూ, పత్రికల్లో కథనాలు రాయించడం ఎంత వరకు సమంజసమన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాల్మీకి నాయకులు బోయ రాము, ఓబులేష్, రామలింగమయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న స్పెయిన్ వెటర్నరీ వైద్య బృందం

అనంతపురం అగ్రికల్చర్: ఆధునిక పద్ధతుల్లో కుక్కల్లో సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు (అనిమల్ బర్త్ కంట్రోల్-ఏబీసీ) ఎలా చేయాలనే అంశంపై స్పెయిన్‌కు చెందిన వెటర్నరీ వైద్య బృందం ఆధ్వర్యంలో గురువారం శిక్షణ ప్రారంభించారు. స్థానిక టీవీ టవర్ సమీపంలోని ఆర్డీటీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌లో ఐదుగురు స్పెయిన్ బృందం పశుసంవర్ధకశాఖకు చెందిన పశువైద్యులకు విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో బ్యాచ్‌కు ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తారని, ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం తెలిపారు.

మొబైల్ ఆధార్ కేంద్రం తనిఖీ

కనగానపల్లి: మండలంలోని తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు చేస్తున్న ఆధార్ నమోదును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, దీన్ని ప్రతి 10 సంవత్సరాలకోసారి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక దువా చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా అభివృద్ధికి ప్రత్యేక దువా చేయాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ పిలుపునిచ్చారు. స్థానిక పాతూరులోని ఆజం ఫంక్షన్ హాల్‌లో అల్ అహద్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న యాత్రికులకు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోందన్నారు. మౌలానా ముస్తాక్ ప్రత్యేక దువాను చేశారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్, సచివాలయ కన్వీనర్ ఇమ్రాన్, ఖాజా మొయిన్, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్రా యాత్రికులకు వీడ్కోలు చెబుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

నేడు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

అనంతపురం/అనంతపురం టవర్‌క్లాక్: కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు శుక్రవారం బంద్ చేస్తున్నట్లు విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం స్థానిక రోడ్లుభవనాశాఖ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో నారాయణ కళాశాల యాజమాన్యంపై ఇప్పటిదాకా చర్యలు తీసుకోలేదన్నారు.ఇందుకు నిరసనగా విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయిస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏపీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర, పరమేష్, సురేష్ యాదవ్, రమణయ్య, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై అనంతపురంలో నిరసన వెల్లువెత్తింది. రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్‌ఎన్‌ఎల్, తపాలా శాఖ కార్యాలయాల ఎదుట గురువారం నిరసన తెలిపారు. కృష్ణా కళా మందిరం నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల వరకు నిరసన ప్రదర్శన కొనసాగింది. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాలరంగయ్య ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని కేంద్ర బడ్జెట్‌ను తప్పుబట్టారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు రాయుడు, మనోహర్, శ్రీకాంత్, చంద్రశేఖర్, కరీం, చిన్నా, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన తెలుపుతున్న రైతుల సంఘాల నాయకులు

వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేద్దాం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, పోలీసు అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వెట్టిచాకిరీ నిర్మూలన దినం పురస్కరించుకొని అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగరంలో 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. సుమారు 2000 మంది విద్యార్థినులు,150 మంది పోలీసులు ఐసీడీఎస్, సోషల్ వెల్ఫేర్, చైల్డ్ లైన్ 1098, లేబర్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. సప్తగిరి సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి, వెట్టిచాకిరి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు.

నగరానికి తహసీల్దారు కార్యాలయం

- ఫలించిన ఎమ్మెల్యే 'అనంత' కృషి
- విభజనకు కేబినెట్ ఆమోదంతో మార్గం సుగమం

అనంతపురం అర్బన్: అనంతపురం నగరానికి తహసీల్దారు కార్యాలయం ఏర్పాటు కానుంది. అనంతపురం తహసీల్దారు కార్యాలయ విభజనకు రాష్ట్ర మంత్రివర్గ మండలి ఆమోదం తెలపడంతో మార్గం సుగమం అయ్యింది. నగర జనాభా పెరిగిన నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయం తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేసిన కృషి ఫలించింది. అనంతపురం రూరల్ తహసీల్దారు కార్యాలయం పరిధిలోకి ప్రస్తుతం అనంతపురం నగరంతో పాటు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం, రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని కొన్ని గ్రామాలు వస్తున్నాయి. అనంతపురం నగరంలో ప్రస్తుతం 5 లక్షల మేర జనాభా ఉండగా, అనంతపురం రూరల్ మండలం పరిధిలో 2 లక్షల మేర జనాభా ఉన్నారు. దాదాపు 7 లక్షల జనాభాకు ఒకే తహసీల్దారు కార్యాలయం కావడంతో పరిపాలనపరంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందడంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అనంతపురం నగరానికి వేరుగా తహసీల్దారు కార్యాలయం ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తీసుకెళ్లడంతో పాటు ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయన కృషి ఫలించి తహసీల్దారు కార్యాలయ విభజనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

ప్రజలకు సత్వర సేవలు :

అనంతపురం తహసీల్దారు కార్యాలయం విభజన చేయడం ద్వారా అనంతపురం నగరానికి వేరుగా ఒక కార్యాలయం, అనంతపురం మండలానికి ఒక కార్యాలయం ఏర్పాటు అవుతుంది. దీంతో పాలనాపరంగా అధికారులు, సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గుతుంది. అదే క్రమంలో ఇటు నగర ప్రజలకు, అటు మండల ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరం అందుతాయి.

అనంతకు అధిక ప్రాధాన్యత

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనంతపురం జిల్లాకు అధిక ప్రాధాన్యత అందిస్తున్నారు. అనంతకు ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయంతో పాటు, ప్రత్యేకంగా డీఎస్పీ కార్యాలయాల ఏర్పాటు గర్వకారణం. గతంలో చాలాసార్లు తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరాం. నగరంలో 6 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. చిన్న విషయాలకు కూడా జాప్యం జరుగుతోంది. ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా త్వరితగతిన పనులు పూర్తవుతాయి. పరిపాలన సౌలభ్యంగా కొనసాగుతుంది. మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం చాలా గర్వకారణం.

- అనంత వెంకటరామిరెడ్డి ,ఎమ్మెల్యే